క్లుప్తంగా

భూరక్ష పథకం రైతులకు ఎంతో మేలు



బొల్లాపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల జెడ్పీటీసీ ఆర్ బీమీ బాయి అన్నారు. మండలంలోని మేళ్లవాగు రెవెన్యూ పరిధిలో డ్రోన్ ద్వారా రీసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మేళ్లవాగు రెవెన్యూ పరిధిలో లాలిపురం, రాజానాయక్ తండా, బీఎల్ కాలనీ, రెడ్డిపాలెం, మేళ్లవాగు, జయంతి రామాపురం, వెంకటరెడ్డి పురం గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులకు ఈ సర్వే ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బి.శ్రీరామ్‌రెడ్డి, ఎంపీటీసీ ఎం.రాములు నాయక్, బి.రాధ, గ్రామ సర్పంచ్‌లు, కె.ప్రభాకర్, వై.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళాలు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు ఈనెల 22న పురస్కరించుకుని కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యులు నాగుబడి వీర నారాయణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని చినకంచర్ల గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు-సుబ్బాయమ్మ దంపతులు 5 వేల విస్తరాకులు, 15 వేల వాటర్ గ్లాసులు, 5 వేల కప్పులను విరాళంగా అందజేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు వ్యవస్థాపక కమిటీ సభ్యులు బోడాల లక్ష్మయ్య, ముంద్రు రమణయ్య, బోడెపూడి వెంకటేశ్వర్లు, పొనుగోటి వెంకట్రావు, ఉన్నం అప్పారావు, పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ వారి సారథ్యంలో వీధి కుక్కలు పట్టివేత కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి కొమిటినేని అశోక్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కల సంచారం ఉండటంతో గ్రామస్తుల సహకారంతో సత్వర చర్యలు చేపట్టామన్నారు. పట్టుకున్న కుక్కలను అడవిలో వదిలి వేస్తామన్నారు. వారం రోజుల పాటు ఈకార్యక్రమం కొనసాగుతుందని 70 కుక్కలను పట్టుకున్నట్లు చెప్పారు.

అప్పాపురంలో నేడు ఎల్‌ఈఎఫ్ చర్చి ప్రతిష్ట



నాదెండ్ల: అప్పాపురం దళిత వాడలో నూతనంగా నిర్మించిన ది లెమన్ ఇవాంజికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ నూతన చర్చి ప్రతిష్ట మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ సీహెచ్ జేమ్స్ చెప్పారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ప్రతిష్టా ఆరాధన కార్యక్రమానికి గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల ఎల్‌ఈఎఫ్ ఇన్‌చార్జి కె.పీటర్‌పాల్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమ సమన్వయకర్తగా మాజీ సైనికోద్యోగి దావల విలియంజోసఫ్, సంఘ పెద్దలు పర్యవేక్షించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీల పట్టివేత



ఈపూరు: అధిక లోడు, సరైన పత్రాలు లేనందున ఐదు గ్రానైట్ లోడుతో ఉన్న లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్టూరు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న అధిక లోడు, సంబంధిత సరైన పత్రాలు లేని గ్రానైట్ లోడు లారీలను మండల పరిధిలోని అంగలూరు వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విప్పర్ల వెంకట్రావు తెలిపారు. వీటికి భారీ స్థాయిలో జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

తిరునాళ్లు సజావుగా జరిగేలా సహకరించాలి

శావల్యాపురం: ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 22న మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ తిరునాళ్లకు అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిట లాడింది. ఆదివారం అమ్మవారి సన్నిధిలో వివిధ గ్రామాలకు భక్తులు పొంగుళ్ళు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవాలయం చుట్టూ పశువులు, జీవాలు, ప్రదక్షణలు చేయించారు.

రెవెన్యూ కోర్టుకు విశేష స్పందన

జగనన్న పాలనలో అందరికీ మేలే జరుగుతోంది. గతపాలకుల హయాంలో ఎక్కడి సమస్యలక్కడే అన్నచందంగా ఉండేవి. కానీ నేడా పరిస్థితి లేదు. ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయం కావాలన్నా, పరిష్కారానికి నోచుకోని సమస్యతో సతమతమవుతున్నా.. ఆయా వ్యక్తుల చెంతకు రెవెన్యూ యంత్రాంగాన్ని మరింత చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన 'రెవెన్యూ కోర్టు' వినుకొండలో మంచి ఫలితాలను ఇస్తోంది. మూడు నెల్లనాడు ఆరంభమైన ఈ కోర్టుకు ఇప్పటి వరకు 35 అర్జీలు వచ్చాయి. వాటిల్లో పదహారింటికి పరిష్కారమూ దొరికింది. దీంతో ప్రభుత్వం, పాలకులు, యంత్రాంగంపైనా అర్జీదారులకు ఒక దృఢమైన నమ్మకం ఏర్పడింది.

- అర్జీదారులకు స్వల్పకాలంలోనే సత్ఫలితాలు
- స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం
- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం విజయవంతం



రెవెన్యూ కోర్టు నిర్వహిస్తున్న వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్

వినుకొండ (నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజాసమస్యలపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. స్పందన కార్యక్రమంలో జిల్లాస్థాయి, డివిజన్ స్థాయిలో వచ్చిన సమస్యలను మరలా ప్రతి శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ కోర్టు నిర్వహించి విజయవంతంగా సమస్యలను పరిష్కరిస్తున్నారు. వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రెవెన్యూ కోర్టు నిర్వహిస్తూ సమస్యలను విజయవంతంగా పరిష్కరిస్తున్నారు. మూడు నెలల క్రితం ప్రారంభమైన రెవెన్యూ కోర్టులో వినుకొండ తహసీల్దార్ కార్యాలయానికి 35 అర్జీలు పిటీషన్లు రాగా అందులో 16 సమస్యలు రెవెన్యూ కోర్టులో పరిష్కారమయ్యాయి. మిగతా పిటీషన్లు విచారణ దశలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు కూడా రెవెన్యూ కోర్టులో పరిష్కారం కావడంతో ఫిర్యాదుదారులు ప్రభుత్వం పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమం విజయవంతం

స్పందన ఫిర్యాదులతో పాటు ప్రభుత్వం ఇటీవల జగనన్నకు చెబుదాం అనే వినూత్నమైన టెలివాయిస్ మెసేజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 1902 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ, మున్సిపల్, అగ్రికల్చర్, విద్య, ఆరోగ్యం, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు సంయుక్తంగా సమస్యలను పరిష్కరించడం జరుగుతోంది. ఇప్పటివరకు వాయిస్ మెసేజ్‌కు సంబంధించి 6 ఫిర్యాదులు రాగా అందులో 4 సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు.

పరిష్కారం దొరికింది



ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందనడంలో సందేహం లేదు. గత ఏడాది క్రితం మా తల్లి ముంతాజ్‌బేగం వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ సర్వీస్‌లో మృతిచెందారు. అయితే కారుణ్య నియామకానికి సంబంధించి మా తమ్ముడు మహబూబ్ సుభానికి నాకు మధ్య వివాదం తలెత్తడంతో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశా. అయితే వినుకొండలో రెవెన్యూ కోర్టులో ఇరువురు అన్నదమ్ములను పిలిపించి సమస్యను పరిష్కరించి తనకు ఉద్యోగం వచ్చేలా కృషి చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మా సమస్య పరిష్కారమైంది.

–షేక్ బాజీబాబు, వినుకొండ టౌన్

సమస్యలకు చక్కటి పరిష్కారవేదిక



ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో జిల్లా స్థాయి, డివిజన్ స్థాయితో పాటు స్థానికంగా వచ్చే సమస్యలను ప్రతి శనివారం రెవెన్యూ కోర్టు నిర్వహించి పరిష్కరిస్తున్నాం. గత మూడు నెలల కాలంలో 35 పిటీషన్లు రాగా అందులో 16 సమస్యలను రెవెన్యూ కోర్టులో పరిష్కరించాం. క్రమంతప్పకుండా రెవెన్యూ కోర్టు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలి.

–కిరణ్‌కుమార్, తహసీల్దార్, వినుకొండ

అకాల వర్షంతో తిప్పలు

రెండు రోజుల ఉపరితల ద్రోణి రైతులతోపాటు సామాన్యులకు సైతం వణుకుపుట్టిస్తోంది. పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు సైతం నెలకొరిన ఘటనలు లేకపోలేదు. ఇంకొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న నేలవాలింది.



ఈదురు గాలులకు పడిపోయిన జామతోట వద్ద రైతన్న



రొంపిచర్ల మండలంలో ఈదురు గాలలకు పడిపోయిన మొక్కజొన్న పంట



ఎడ్వర్డ్‌పేటలో ఈదురుగాలులకు పడిపోయిన గృహాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఈదురు గాలులకు నేల రాలిన బొప్పాయి కాయలు

- ఈదురుగాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు
- రూ.20 లక్షల రూపాయల నష్టం
- పలు గ్రామాల్లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు, ఈదురుగాలులకు ఎడ్వర్డ్‌పేట, కొత్తపల్లి, చాకలికుంటతండా గ్రామాలలో 80 విద్యుత్ స్తంభాలు పడిపోయి రూ.20 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ఏడీఈ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. దీని ప్రభావం వలన మండలంలో ఎడ్వర్డ్‌పేట, కొత్తపల్లి, చాకలికుంటతండా, వి.రెడ్డిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పడిపోయిన విద్యుత్ స్తంభాలను ఆదివారం నరసరావుపేట విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు, గ్రామాలలో పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేస్తామన్నారు. పొలాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను రైతుల సహకారంతో పంట దెబ్బ తినకుండా ఏర్పాటు చేస్తామన్నారు.

రైతులు.. జాగ్రత్తలు తీసుకోండి

ఈపూరు: అల్పపీడన ప్రభావం వలన కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వివిధ రకాల పంటల్లో జాగ్రత్తలు పాటించడం వల్ల పంట నష్టం జరగకుండా చూసుకోవచ్చని వ్యవసాయాధికారి ఆర్. రామారావు అన్నారు. మండలంలోని బొగ్గరం, కొండాయపాలెం గ్రామాల్లో పలు రకాల పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి పడిపోయి 3,4 మొక్కలను కలిపి నిలబెట్టి కట్టుకోవాలని, తద్వారా కోత సమయంలో ఇబ్బంది పడకుండా సులభతరం అవుతుందన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

నరసరావుపేట రూరల్: అకాల వర్షాలు మండలంలోని మొక్కజొన్న, మిరప రైతులకు నష్టాలు తెచ్చిపెట్టాయి. కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట పలు చోట్ల నేలకొరిగింది. కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్నను పలు గ్రామాల్లో మిషన్‌తో కోస్తున్నారు. నేలకొరగడం వలన మిషన్ కోత కష్టంగా మారుతుంది. కూలీలతో కండెలు విరిచి విత్తనాలు తీయడం రైతులకు అదనపు భారం కానుంది. ఇప్పటికే కోసి ఆరబెట్టిన మొక్కజొన్న పంట వర్షంపాలు కాకుండా ఉండేందుకు రైతులు పట్టాలు కప్పి తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. అలాగే మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో వర్షాలు రావడంతో కోతలు నిలిచిపోయాయి. కలాల్లో ఆరబెట్టిన మిరప పంటను తడిచిపోకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచారు

అమీన్‌సాహెబ్‌పాలెంలో..

నాదెండ్ల: అల్పపీడన ద్రోణి కారణంగా గత రెండు రోజులుగా వాతావరణం మారి వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో వడగండ్ల వానకురిసింది. ఒక్కసారిగా మోస్తరు సైజు వడగండ్లు కురవటంతో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న వారు పరుగులు తీశారు. రహదారిన వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారులు వడగండ్ల కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. పొగాకు పంటపై వడగండ్ల ప్రభావం కనిపించింది. ఆకులు వంగిపోవటంతో రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి కన్పిస్తోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, చేలల్లో కోయాల్సిన మిర్చి, పొలాల్లో కోతకొచ్చిన పొగాకు, ఆరబెట్టిన పొగాకు తడిచాయి. శనగ పంట చివరి కోతలు, మొక్కజొన్న కూడా కోత దశలో ఉంది. అకాల వర్షంతో పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని పట్టలతో కప్పి కాపాడుకునేందుకు పరుగులు తీశారు.

20 గృహాలకు నష్టం

రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేట గ్రామంలో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షాలకు పడిపోయిన పూరిళ్లు, రేకుల ఇళ్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. గ్రామంలో ఈదురు గాలులకు సుమారు 20 గృహాలు దెబ్బ తిన్నాయన్నారు. ఈదురు గాలుల దాటికి పలు చెట్టు కూడా పడిపోయినట్లు గుర్తించారు.

నేల వారిన పైరులు

రొంపిచర్ల: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మొక్కజొన్న, బొప్పాయి, జామ, మిర్చి, మంచి శనగ పైర్లు దెబ్బ తిన్నాయి. మొక్కజొన్న పంట నేల వాలగా, బొప్పాయి చెట్లు పడిపోవడం, కాయలు రాలిపోవటం జరిగాయి. జామ చెట్లు కూడా నేలకొరిగాయి. మంచి శనగ పైరు వర్షానికి దెబ్బ తినగా, పొలంలో ఉన్న మిర్చి, కల్లాల్లో ఉన్న మొక్కజొన్న, మిర్చి, కొతకు సిద్ధమైన మంచి శనగ పైర్లకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యడ్లపాడులో....

యడ్లపాడు: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వడగళ్ల వాన కురిసింది. అల్పపీడనం ద్రోణీ ప్రభావంతో యడ్లపాడు మండలంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుంది. చెంఘిజ్‌ఖాన్ పేట, తిమ్మాపురం, యడ్లపాడు, కారుచోల, లింగారావుపాలెం తదితర గ్రామాల్లో ఆరబోరిన మిర్చి కల్లాలపై రైతులు పరుగున వెళ్లి పరదాలను కప్పుకున్నారు. మూడు రోజు లుగా కురుస్తున్న వానకు చేతికొచ్చిన కల్లాల్లోని మిర్చిపంట తడిసి పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు.

నరసరావుపేటలో వడగండ్ల వాన



కోర్టు ప్రాంగణంలో పడిన వడగండ్లు

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. పెద్దశబ్దంతో పడిన వర్షానికి అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. చిన్న గోలీ సైజులో ఉన్న వడగండ్లు ఆకాశం నుంచి వేగంగా గాలితో కలిసి నేలను తాకాయి. వీటి ప్రభావానికి చెట్ల ఆకులన్నీ రాలి రోడ్లపై నిండుకున్నాయి. ఆ సమయంలో రోడ్లపై వాహనాలపై వెళ్లేవారు, నడిచి వేళ్లేవారు సమీపంలోని ఆసరాల కిందకు చేరుకున్నారు. ఆ తర్వాత మామూలుగా పెద్ద వర్షం కురిసింది. ఈ వర్షం నరసరావపేట, రొంపిచర్ల మండలాల్లో పడింది. పట్టణ శివారు ప్రాంతాలతో పాటు పట్టణం మొత్తం వడగండ్ల వారి పడింది. ఆసమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు. ఎక్కడా ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలియ చేశారు.

క్రమం తప్పని నడకతో వ్యాధుల నియంత్రణ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జి మంజువాణి

చిలకలూరిపేట: క్రమం తప్పని నడక, మంచి పోషకాహారంతో థైరాయిడ్, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని విజయవాడకు చెందిన డయాబెటాలజిస్ట్ డాక్టర్ జి.మంజువాణి చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ గట్టు రంగారావు ఆసుపత్రిలో అబ్బాట్ లేబొరేటరీస్ సౌజన్యంతో 150 మందికి ఉచిత థైరాయిడ్, బ్లడ్ షుగర్ పరీక్షల వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవన విధానం, జంక్‌ఫుడ్ వంటి కారణాలతో నేటి సమాజంలో థైరాయిడ్, షుగర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని వివరించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు, వ్యాయామం, నడక, యోగ వంటి వాటితో ఇలాంటి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గట్టు సరోజిని, క్లబ్ అధ్యక్షురాలు ఎన్.రాజ్యలక్ష్మి, కార్యదర్శి ఎన్.జయలక్ష్మి సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి నేత్రాలు దానం చేసిన బంధువులు



అవయవ దానం చేసిన ముండ్లమూరి నాగేశ్వరరావు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన ముండ్లమూరి నాగేశ్వరరావు (80) వృద్ధాప్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల అనుమతితో అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి ఐబ్యాంకుకు నేత్రాలు దానం చేసినట్లు చెప్పారు. కళ్లు దానం చేయటం వలన మరోకరికి కంటి చూపు రావటం మంచి శుభపరిణామని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర కంటి వైద్య నిపుణులు రియా మాట్లాడుతూ ఎవరైనా మృతి చెంది.. ఐస్ బాక్సుల్లో ఉంచితే 8 గంటల తదుపరి కంటి దానం చేయటానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. దానం చేసిన కళ్లు ఇద్దరు కార్నియల్ అంధులకు చూపుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాదినేని కృష్ణమూర్తి, ముండ్లమూరి నీలాద్రి గ్రామస్తులు,ఉన్నారు.

భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఈపూరు: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని భద్రుపాలెం, బొమ్మరాజుపల్లి, కూచనపల్లి గ్రామాల్లో త్రైతసిద్ధాంతం – ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞానవేదికకి చెందిన చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, మన పండుగలు, సంప్రదాయాలు గ్రంథాల ప్రచారం జరిగింది. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు వివరించారు. ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత ఆది సృష్టి ఏర్పడింది కాబట్టి మొట్ట మొదటి పండుగ ఉగాది అని తెలిపారు. ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదంను తయారు చేసి దైవం ముందర ఉంచి మాలోని ఆరు గుణముల మాయను తీసివేసి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థించే వారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, యద్దనపూడి రామాంజనేయులు, వై.చిలకమ్మ, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యం, సతీష్, నరేంద్ర, భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నాయకుల ఆందోళన



స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

యడ్లపాడు: ఆంధ్రప్రదేశ్ సమైఖ్య వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. యడ్లపాడు గ్రామంలోని వడ్డెర మహిళ డేరంగుల నర్సమ్మపై ఇటీవల జరిగిన దౌర్జన్యంపై తన ఇంటిని కొందరు అక్రమించుకున్నట్లు ఆరోపించారు. ఈవిషయంలో పోలీసులు తగు విచారణ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేసే వరకు తమ సంఘం తరుపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెల అంజమ్మ, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు సురేష్ బాబు, రాష్ట్ర గౌరవ ఉపాధ్యక్షులు డేరంగుల హనుమంతరావు, బాపట్ల జిల్లా కార్మిక అధ్యక్షులు మల్లెల శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి




ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న హజరత్ మౌలానా రజావుల్‌హక్

చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవడం ద్వారా సమాజంలో శాంతి, ఆధ్యాత్మిక భావనలు పెరుగుతాయని ఆధ్యాత్మిక గురువు హజరత్ మౌలానా రజావుల్‌హక్ చెప్పారు. పట్టణంలోని సుభానినగర్‌లో ఉన్న పైజానే గరీబ్ నవాజ్ మదరసా వార్షికోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో నడిచినప్పుడే అశాంతి, హింసా ప్రవృత్తులు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో సుభాని నగర్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని హజరత్ పీర్ మొహమ్మద్ ముక్తారుల్లాషా పర్యవేక్షించారు.

ఉచిత శిక్షణకు నవోదయ విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 12వ తరగతి చదివే విద్యార్థులకు నిర్వహించే ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ఎంపికవ్వడం హర్షణీయమని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ దక్షిణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నీట్ (మెడికల్) జేఈఈ (ఐఐటీ) కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని చెప్పారు. ఈ పరీక్షల్లో విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జి.ప్రవీణ్‌కుమార్, ఎం.కార్తీక్‌లు ఇంజినీరింగ్‌లో, కె.మనోజ్‌నాయక్, ఎ.వీరాంజనేయులు నాయక్ మెడికల్ కోర్సులకు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా 621 నవోదయ విద్యాలయాల్లోని విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ. 2 లక్షలు దక్షిణ ఫౌండేషన్ చెల్లించి, నాలుగు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

సెల్ టవర్ తొలగించాలని ఆందోళన



సెల్ టవర్ వద్ద ఆందోళన చేస్తున్న నివాసితులు

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో రుద్రవరం గ్రామానికి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలంటూ నివాసితులు ఆదివారం ఆందోళన చేపట్టారు. సెల్‌టవర్ నుంచి వెలువడే రేడియేషన్‌తో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరారు. చిన్నారులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వస్తున్నాయని చెప్పారు. సెల్ టవర్‌కు సంబంధించి గడువు ముగిసిందని, మరలా పునరుద్ధరించేందుకు అనుమతి మంజూరు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రామారావు, జవ్వాజి కొండలు, జవ్వాజి శేషు, గోపీ, సైదు బాబు, అయ్యప్ప, వెంకటసైదయ్య, సుబ్బారావు, తాళ్ళనాగేశ్వరరావు పాల్గొన్నారు.